
గిరిజన భాషా మాండలికం

శ్రీ పి. శివరామకృష్ణ



శ్రీ పి. శివరామకృష్ణమూర్తి

గిరిజన భాషా మాండలికం

శ్రీకాకుళం, విశాఖ, తూర్పు పశ్చిమ గోదావరులు, ఖమ్మం జిల్లాలలో మన్య ప్రాంతం ఏక ఖండంగా వ్యాపించి యున్నది. ఈ జిల్లాలలో కోయలు, సామంతులు, సవరలు, గదబలు తప్ప మిగిలిన కొండ జాతుల మాతృభాష తెలుగే. వీరు ముఖ్యంగా కొండరెడ్లు, బగతాలు, వాల్మీకులు, కమ్మరులు మొదలైన జాతుల వారు. ఖమ్మం జిల్లాలో ఉర్దూ ప్రభావం, విశాఖ, శ్రీకాకుళం జిల్లాలలో ఒరియా భాష ప్రభావం, కోయలు ప్రాంత మంతా వ్యాపించి ఉన్నారు కాబట్టి అంతటా కోయ భాషా ప్రభావం ఉంటుంది. తరతరాలుగా నాగరికులతో సంపర్కం చాలా స్వల్పమైనందు వలన వీరి భాష – ఆచార వ్యవహారాలు, పాటలు – వానిలో సహజత్వం – ప్రాంతీయత జీవనసరళి ఇంకా ప్రత్యేకతను గోల్పోలేదు. గిరిజన ప్రాంతంలో ఏ కృషికైనా ఉన్న ప్రాకృతిక అవరోధాల వల్ల ఈ సాంస్కృతిక పరిశోధన జరుగక ఉంటూ ప్రత్యేకతలు వెలుగు చూడలేదు. ఆంధ్ర దేశంలో ప్రామాణికమైన భాషా మాండలికాల జీవశక్తి, భాషకు సౌష్ఠవం కల్పిస్తున్నట్లే ఈ మాండలికంలోని ధాతవు పదాలు – వృత్తి మాండలికాలు – పద నిర్మాణం (World formation) క్రొత్త ధాతువులు – వ్యవహారంలో కనిపించే ప్రాచీన ధోరణి – ఉనిక– ఆదాన ప్రదానాలు. చెట్లు, పుట్టలు, పక్షుల పేర్లు–సామెతలు– పదబంధాలు – జాతీయాలు ఇవన్నీ సంకలనం చేయగలిగితే మన భాషకు మరింత పుష్టి కలుగుతుంది. తులనాత్మక అధ్యయనం చరిత్ర గతిని కూడా గ్రహించడానికి తోడ్పడవచ్చు. ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లా గిరిజన భాషా విశేషాలను ముచ్చటిస్తాను.

భాష

ఉచ్చారణలో ఉనిక అధికం. సాధారణంగా రెండక్షరాలు మించిన మాట మీద, దీర్ఘం మీద (అది పదాదిలో ఉన్నానరే) ఉనిక ఉంటుంది. మనవలె మాటలు ప్రవాహవేగంతో ధారాళంగా సాగవు. ఉదా: గెద్దాడ ఒక గ్రామం పేరు కాని కొండవారు ఇప్పటికీ గెడ్డవాడ అని మాత్రమే అంటారు.

గెడ్డ=కాలవ. ఈ ఊరిని ఆనుకొని ముఖ్యమైన కాలవ ప్రవహిస్తూంది పదాలు – కోంతి. తెలుగు మాస్టారు. వచ్చిది పోయిది (వచ్చినవి పోయినవి), వానికి పిలువడమటం= ద్వితీయకు షష్ఠి, భావార్థ కాంతం ఈ రకం ప్రయోగాలు ఇక్కడ సహజం. మనమేల మోయడము ?. ఉదాత్తమైన ఉనిక రమ్మీ=రావోయ్, వాడు వచ్చిడి–పోయిడి (వచ్చాడు పోయాడు) వచ్చిది - పోయిది.

ఈ ఉనిక ప్రాచీన పదజాలం మూలంగా వారు మాట్లాడేది ఒక పట్టాన అర్థం కాదు. కనీసం రెండు మూడు నెలలు అలవాడుపడాలి. తత్సమాది యుగా మాండలికంలో దాదాపు పదోవంతు దాకా ఉన్నాయి. వాటిని చాలా అపభ్రంశంగా ఉచ్చరిస్తారు.

ఉదా: లచ్చుకల్లే నసే రాముకల్లే నమో (పెండ్లి పాట) ఈ లచ్చుకల్ను ఏమిటా అని నేను చాలా రోజులు తలబద్దలు కొట్టుకున్నాను లక్ష్మీకల్యాణమో – రాము కల్యాణమో దీనికి వచ్చిన తిప్పలు అది పాండవులను పాండుగులు వైద్యుడు (ప్రకృతి) వెజ్జు (వికృతి) అని ఉన్నత పాఠశాలల్లో చదువుకునే రోజుల్లో తెలుగు పండితులు చెప్పుతుంటే యూ వెజ్జు అని మనం పలకము కదా. ఈయన ఎందుకు చెపుతున్నట్లు అని అనుమానం రాకతప్పదు. ఇక్కడి పిల్లలకు అటువంటి సందేహం రా ఇక్కడ తల్లుల్లను దాదాపు తద్భవాలుగానే పలుకుతారు.

గురువు=గొరవ; కుంతి=గొంతి, బందుగులు=వెజ్జు.

పదజాలం

(వ్యవసాయానికి సంబంధించినవి.)

పూడు=కాడి; తామర=కాడి మధ్యన వేసే మేకు; కచలి=తవ్వుగోల; బలవ=పికాస్ (రైల్వే పని వారు కంకరలాగే సాధనం వంటిది); వార్ణము=ఆరికత్రాడు;పట్టిబల్ల=చదునుపరిచే; తట్ట=పొలంలో ఆత్మరక్షణార్థం వేసుకొనే గుడిసే ఇది నేలవరకు దించేసివుండి, ఒక కన్నం గుండా బయటకు చూడవచ్చు.

అరప=మంచె; కయ్యులు నరకుట–మోళ్ళు నరకుట; బోద=చిన్న గుండ్రాయి; చీర్ణం=ఉలి; సోగ=మేడిశీలి; మొల్ల = మేకు; మొల్లకారు మనకెంతో మురిపెము–ఖరీదుఅయిన విరుగుడు చేవ (రోడ్‌వడ్) ముక్కను వీరు నాగలి మొద్దుకు – తొందరగా అరగదు – బరువు అని వాడతారు ఈమాట వింటూంటే 'మలయే భిల్లపురంధ్రీ చందన తరు కాష్ఠం ఇంధనం కురుతే' అంటూ జగన్నాధరాయలు గుర్తుకొస్తున్నాడు గదూ.

ఇల్లు

జాగాలు=కర్రలు; సత్తర=అటక; తేనెబల్ల=కొమరబల్ల. (దీనిని ఆరెకత్రతో చేయడం ఇక్కడ సంప్రదాయం=గృహవాస్తు.

సాటు=దిమ్మిస చేయడం; ఇల్లు కట్టక ''సాటు భోజనం'' (సమారాధన) ఆచారం; గుమ్మం, బల్ల=ద్వారము;

కండువ=దూలాలపై వేసే అడ్డు దూలాలు; పీను=అరుగు; వడ్డు=వరండా; అంట్లూగ్రర=తొట్టి; తుప్ప=కోడి గ్రుడ్లు పెట్టే చిన్న అరుగు.

వంటసామగి

పిండి పిడత=అంబలి పులియబెట్టు కుండ

చన్నీళ్ళ ఎళ్ళెం } కొండవారికి (రెడ్లకు) మడి తడి ఉన్నది.
చన్నీళ్ళ కుండ } ఈ మడి కట్టుకున్న మనిషిని ఆ మడి నీళ్ళకుండను ఇతరులు తాకరు.

కంటి చేయడం=కర్రల రాపిడితో నిప్పు చేయడం (చాలా సులభంగా నిముషంలో చేస్తారు)

సాద=దివిటీ (రాత్రి దారి జూపేందుకు వెలిగిస్తారు)

తిలికె=దీపం. చట్టిగ్రర=తెడ్డు. కిమ్మ=చిల్లుల తెడ్డు.

దాగరి=పిండి విసరెడు బుట్ట (''వరుగుతో దాగరయు నిండ వలసినట్లు''—ఉత్తర హరివంశం—సోమన)

జిల్లె=ఎండబెట్టు బుట్ట.

జిల్పు=అన్నం వార్చే వట్టా. పల్లకె=చిన్నబుట్ట; సన్నికె=చిన్నగంప.

జోకి=నీళ్ళుముంచే ఆనపకాయ చిప్ప. బుర్రడిప్ప—నాగస్వరం

వేపుడుబల్ల, జగుడి=అల్పాహారం (విశాఖ జిల్లా)

కత్తులు-విల్లమ్ములు

ఓలకత్తి=మంగలికత్తి; గొబ్బె కత్తి=పెద్దకత్తి. (సోట కత్తి కంటె కొంత చిన్నది) ఉసికత్తి=కూరలు తరుగుకునే చిన్నకత్తి.

గొండ్లెము=వింటినారి. మిట్ట=ఇనుపముక్కులేని సాదా అలుగు.

తున్ను=సాదా అలుగు చివర తొడిగే చిన్న వెదురు గొట్టం.

గడ్డికొరప=తున్ను పెట్టని అలుగు.

పిట్టలు-జంతువులు

బుచ్చి=పిట్ట; పొదరిబండ=ఎలుక; మోర్ర=పందికొక్కు; పాలదోకి=పొడవుకోతి; కొక్కిపిల్లి=కుందేలు; పులి=కండచీమ. వెదురెలుక=గురుడిపిట్ట (దీని మాంసంతో నంజుడు చాలా రుచిగా ఉంటుంది) వేపి=కుక్క; (నన్నెచోడుడు ఈ పదాన్నే 'కుమార సంభవం'లో ప్రయోగించాడు ఇది ఇక్కడ ప్రచురం.)

మెకము=క్రూరజంతువు

అరిజ=కాకి.

ఇతర పదాలు

మొరకలు=చెవులు, యాపలు=వ్రేళ్ళు; చెల్ల=నమస్తము.

గగ్గ=పొట్ట; గబ్బట్లా=వయసులోనున్న కన్యలు.

ఘాటులు=పిల్లలు; గోవులు=యువకులు,జొజం= మద్దెల. చొంచ=చిన్న మద్దెల.

గుమ్మడి=నృత్యంలో జట్టుకట్టడం (నా రాచ గుమ్మడి)

గండి=కొండ; పల్లా=30కుంచాల; కేలెం కర్ర=త్రాసు.

ఈ త్రాసు కొండవారి సృష్టి. ఇది మన రైల్వే స్టేషన్‌లలో పెద్ద బరువులను త్రూచే యంత్రంయొక్క సూత్రంపై తయారు చేశారు మూరకంటె చిన్న కర్ర దానికి ఒకప్రక్క కొన్ని గీతలు—వానిమీదకు బరువునుబట్టి చిన్న రాయి గట్టిన తాడును జరుపుతూ తూకం నిర్ణయిస్తారు. మన తూకాలతో ఖచ్చితంగా సరిపోతుంది ఈ కర్ర—తరతరాలుగా ఈ ప్రాంతంలో వాడుకలో ఉంది.

నడుగులు=కధలు; కట్టకల్లు=పులిసిన కల్లు

గున్నె=అబ్బాయి; ఎద్గరి=త్వరగా (విశాఖ)

పొరకమోది=సరిహద్దు; నర్పులు=గట్టిగా; చిరిదడి=అల్లరి చిల్లరి; పురుముళ్ళు=బారసాల; వెడ్డి=పెళ్ళికాని; చిచ్చఱ=వేగిస కలప.

పదనిర్మాణం

పెంకువంట=(వైశ్వదేవం)

క్రొత్తపంట వచ్చినపుడు బలిగా ఓటికుండలో వండి, పసుపు పూలు చల్లి ఆ పెంకును పాలంలో పడేస్తారు. అడవిలో పోతున్న ప్పుడు ఏదో ఓటికుండ దొరికితే దానిలో వండుకోవడమూ పెంకు వంటే.

పోతబారం=జీవనది; బార=కాలవ (గడ్డ) ఎప్పుడూపోతగా పారే (ఎడతెగక) కాలువ జీవధార.

పొట్లం పెట్టడం=దొన్నెలో మాంసంపెట్టి నిప్పులో కాల్చడం.

మెతుకు వేయడం=పిండప్రదానం.

పసుపునీళ్ళు చల్లడం=చిన్న దినం.

కీడు. అది-కీళ్ళది, అంగడి + అది= అంగళ్ళది=బతుమతి కావడం, అడవికి పొరడం=రజస్వలకావడం=(ఈ కన్య అడవిలో ఉండాలి)

పై చెంగువేయడం=కడుపుతో ఉండడం

ఇండ్లుచేయడం=పెళ్ళిచేయడం.

ఆవు మూనె = నెయ్యి. నెయ్యి – మూనెగా మారిన చరిత మనకుతెలుసు. ఇది ఆవుతో కలిసి మరల నెయ్యిగా మారింది.

పిండి పిడత–చట్టిగర్ర–కట్టకల్లు – ఆడకట్ట (ఆడ మళయాళం) మొదలైనవి వారు పద నిర్మాణ ప్రతిభకు ఉదాహరణలు.

నూతన ధాతువులు-ధాతుప్రయోగాలు

ఈవుకొనుట=అంటుకొనుట, చెడుకొనుట=ముక్కలుగా కోయుట, పల్లకుండుట=మిన్నకుండుట, ఈడుకొనుట=కొనుగోలుసేయుట.

దొంగ చేయడం = దొంగతనం చేయడం

ఇండ్లు చేయడం = పెళ్లి చేయడం

గొరవ చేయడం = భూతావేశం చేయడం

ఉరుమడి తోలడం=బండి పందుగ తంతు, ఊరుబయటకు బండి తోలడం

తప్ప వేయడం = తప్పమోపి సుంకం వేయడం.

వీనిలో తద్ధితాంతాలు కాక, నామవాచకాలనే అనుబంధ క్రియలుచేర్చి ధాతువులుగా ప్రయోగించడం.

సామెతలు

సాధారణంగా ఆటవిక జీవితంవలె సామెతలు మోటుగా ఉంటాయి. అక్కడక్కడా అశ్లీలాలు కూడా కద్దు.

1 చెప్పిన మాటలు చెవికి చుర్రగ – పట్టిన కుంప వంటికి చుర్రగ.

2 ఇక్కెకు ఇక్క – మంకుకు మంకు (ఇక్కె=బెల్లం కొట్టిన రాయిలా ఉండేవాడు)

3 మాలకు మాటలు పాడుగు – రొయ్యకు మీసాలు పాడుగు. మాలలు–వార్తాహరులు, రెడ్ల దగ్గర ఉద్యోగులు. ఇక్కడ మాలలను వాల్మీకులు అంటారు. (వాల్మీకులు అనే పేరు వచ్చిన కారణం అన్యత్ర వివరిస్తాను.)

4 మాటంటే మాలవాడికి లాభం. (మాట=కబురు)

5 గొడ్డువానికి గోరంతలేదు వెడ్డివానికి విచారం లేదు. (వెడ్డి=పెండ్లి కానివాడు)

6 పిట్టను కొట్ట–పాయిలో పెట్ట=ఏ పూటది ఆ పూటే.

7 మంచి చెడ్డలేక రాతికి మల్లగొల్ల.

8 నాప చిక్కుడు కాపుకు బోటది
(సంవత్సరం దాటిన చిక్కుడు తీగ మరల కాపు కాస్తుంది. ప్రతి యింట్లో చిక్కుడుతీగలు తప్పనిసరిగా చూడవచ్చు).

9 కేపవాడు మాటకు బోటడు – కుంటిగొర్రె పులికి వెరవదు (ఎలాగూ పరుగెత్తలేదు గదా.) (ఏమీలేనివాడు మాటకు సిలబడడు.)

10 ఉండలేనమ్మ సిండికాల్చుకుంది.

11 అంద చందం లేనమ్మ సందెడేల.

12 కుండతో ఓసలేక కుమ్మరిమీద పడితివా.

13 గొట్టిచేస్తే గొల్లవాడికి లాభం : గొర్రెకొవ్వితే గొల్లవాడికి లాభం. గొట్టు చేయడం = పెద్దలు సమావేశమై తగవు తీర్చడం. తప్పు చేసినవాడు పెద్దలకు విందు చేయాలి. ఆ మాంసం కోసం గొల్ల దగ్గర జీవాలుకొనాలి. ఆ అమ్మకం లాభం.

14 పాములలో బుర్ర – ఉడుములలో తోక (ఎక్కడైనా ప్రధాన పాత్ర)

15 చెలుగు చేటుకు -- నవ్వు నష్టంకు (చెలుగు=వెకిలినవ్వు)

16 ఒల్లనమ్మకు చెల్లని గాజులు.

17 పిల్లచేత బెల్లంపెట్టి తల్లితో తంటాలు పడడం.

18 సాదలేని సోమడి పెళ్లికి కంపు బొక్కు కాత కట్టుకొని వెళ్ళాడట.
(కంపు బొక్కు=పాసినకూడు తినేవాడు, కాత=మూట)

19 ఏమీ ఎరుగనివాడు అద్దం చూస్తే అద్దంలో యిద్దరు కనిపిస్తారుట. (ఏమీ ఎరుగక సాక్ష్యం ఇస్తే తనో తీరు – సాక్ష్యం ఒక తీరుగా బయటపడుతుంది)

20 చేతలేని వాడికి చేపల బేరమెందుకు.

కొత్త మొహం చూసి కొండవాడు పారిపోవడం సహజం. సమాధానం ఇవ్వడం ప్రపంచంలో ఎవిమిదవ వింత. అటు వంటి వారిని కబుర్లలోకి ధింపి సామెతలు వగైరా సేకరించడం–కుందేటి కొమ్ము సాధించడం–కుందేటి కొమ్మును కూడా సాధించవచ్చునని గదా సుభాషితం.

ఆచార్యశ్రీ బిరుదరాజు రామరాజుగారి ప్రోత్సాహంతో శరవేగంగా సాగించిన పర్యటనలో మాత్రంగా గమనించిన అంశాలను వాచివి నివేదించడమే ఇప్పటి ఈ వ్యాసం. ముందు ముందు పరిశోధనలో సేకరించే జాతీయాలు లోకోక్తులు మన జాతీయ సంపదలో మరో భాండారం కాగలవు.